



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

7న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. గురువారం కలెక్టరేట్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థి ప్రగతి తెలుసుకోవడానికి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, నాణ్యమైన విద్య అందించడానికి మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ విధంగా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మధ్య మంచి సంబంధాలు నెలకొనేందుకు ఈ సమావేశాలు ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నటువంటి 2 లక్షల 80 వేల మంది విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్ట్, హెల్త్ కార్డులను పంపిణీ చేసామన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం రూ. 47 లక్షల నిధులను కూడా విడుదల చేసిందని పేర్కొన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఒక్కో పాఠశాలకు హాజరవుతారన్నారు.

34 సీజనల్ హాస్టళ్లు : జిల్లాలో 34 సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.. ఇందుకు సంబంధించి ఈ రోజే ఉత్తర్వులు జారీ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఇఓ ఎస్ శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం దొరికేనా..?

- 18 వేలకు పైగా ఫిర్యాదులు పెండింగ్
- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

గ్రామాల్లో నెలకొన్న భూ రెవెన్యూ సమస్యలు పరిష్కారం నోచుకోవడం లేదు. గతంలో అనేక ప్రభుత్వాలు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అనేక చర్యలు తీసుకున్న ఫలితం మాత్రం శూన్యమే. ఇటీవల నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లోనే దాదాపుగా 18వేలకు పైగానే జిల్లాలో భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కారానికి నోచుకోక ముందే మరోమారు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కర్నూలు జిల్లాలోని దాదాపుగా 472 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ప్రారంభం కానున్నాయి. శుక్రవారం నుండి ప్రారంభం కానున్న రెవిన్యూ సదస్సులు జనవరి 8వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈ సదస్సుల్లో ప్రధానంగా రెవెన్యూ సమస్యలకు సంబంధించి ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తారు. మండలానికి రెండు బృందాలను ఈ సదస్సుల నిర్వహణకు ఏర్పాటు చేశారు. ఒక బృందానికి తహశీల్దార్ మరో బృందానికి డిప్యూటీ తహశీల్దార్ ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ సదస్సుల్లో రెవెన్యూ అధికారులు రికార్డులన్నిటిని వెంటపెట్టుకుని హాజరుకానున్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో భూ రెవెన్యూ సమస్యలు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. గత ప్రభుత్వం హయాంలో నిర్వహించిన రీ సర్వేలో భూములకు సంబంధించిన తగాదాలు ఎక్కువగా నమోదు అయ్యాయి. అనేకమంది రైతులకు సంబంధించిన భూముల వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయకపోవడం పట్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులకు సంబంధించిన భూముల వివరాలను తప్పులు తడకగా నమోదు చేశారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భూమి సమస్యలే అత్యధికంగా నమోదు అవుతున్నాయి. ఇప్పుడు ఆ సమస్యలను పరిష్కారానికి నోచుకోకపోవడంతో రెవెన్యూ సదస్సుల్లో వాటికి పరిష్కారం దొరుకుతుందా లేదా అనేది వేచి చూడాల్సిందే. భూ రెవెన్యూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో పరిష్కరించాలని పలువురు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



హోళగుందలో వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ (ఫైల్)

భూ సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6 వ తేదీ నుండి జనవరి 8 వ తేదీ వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.. భూ సమస్యలు లేకుండా చేయడమే ఈ సదస్సుల ప్రధాన లక్ష్యమన్నారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి. రంజిత్బాషా విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులకు తహశీల్దార్, వక్ఫ్ , దేవాదాయ, రిజిస్ట్రేషన్ అధికారి, మండల సర్వేయర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, విఆర్ఒ లు ఒక టీమ్ గా వెళ్లి నిర్వహిస్తారన్నారు. ఒకవేళ పాస్ పుస్తకం కొరకైతే ఎటువంటి చార్జీలు తీసుకోకుండా అక్కడే అఫిషియల్ ఫీజ్ చెల్లించి ఆన్లైన్ లో నమోదు చేయించే విధంగా చర్యలు తీసుకుంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులలో మీ సేవ చార్జీలు లేకుండా ఉచితంగా సేవలు అందించే విధంగా సౌకర్యం కల్పించారని, ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్, నియోజకవర్గానికి ఒక స్పెషల్ ఆఫీసర్ను నియమించామన్నారు. సదస్సులు పూర్తైన 45 రోజుల్లోపు నాణ్యతతో పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.. సమావేశంలో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

వీకర్ సెక్షన్ కాలనీలో శిథిలమైన రోడ్లు

- సిసి రోడ్లను పరిశీలించిన సిపిఎం ప్రతినిధి బృందం

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 36, 37, 41 వార్డుల పరిధిలో ఉన్న వీకర్ సెక్షన్ కాలనీ మెయిన్ రోడ్డు ఎల్లమ్మ గుడి నుండి బిసి కాలనీ వరకు రోడ్డు శిథిలమై గుంతలు పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోని అధికారులు , ప్రజా ప్రతినిధుల వైఖరిని ప్రశ్నిస్తూ కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి టి. రాముడు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.అలివేలు, నగర కమిటీ సభ్యులు ఎస్.శ్యామల, వార్డు నాయకులు ఎస్.సత్యం, ఎం.జమ్మన్న, ఎస్.అబ్దుల్ రెహమాన్, అనసూయమ్మ పార్టీ ప్రతినిధి బృందం శిథిలమైన సిసి రోడ్డును పరిశీలించింది. ఎల్లమ్మ గుడి నుండి బిసి కాలనీ వరకు పగిలిపోయి గుంతలు పడి శిథిలావస్థలో ఉన్న సిసి రోడ్డు వలన ప్రమాదాలు జరుగుతున్న తీరును, ఇబ్బందుల గురించి నాయకులకు స్థానిక వివరించారు. నాయకులు మాట్లాడుతూ 2004 సంవత్సరంలో ఎమ్మెల్యేగా ఉన్న ఎంఏ. గఫూర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి డిఎఫ్ఐడి నిధులతో కర్నూలు నగరంలో పేదల నివసిస్తున్న వీకర్ సెక్షన్ కాలనీ, శరీన్నగర్ , కల్లూరు ముజఫర్నగర్ స్లమ్ ఏరియాలలో కోట్లాది రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేశారన్నారు. తరవాత గెలిసిన ప్రజాప్రతినిధులు రోడ్లు పగిలిపోయి గుంతలు పడి శిథిలావస్థకు చేరుకున్నా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా, కళ్లముందు ప్రమాదాలకు గురి అవుతున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కర్నూలు నగరంలో బాగున్నరోడ్లను డ్రెయినేజీ కాలువలను తవ్వి రోడ్లు, కాలువలు వేస్తున్నారు తప్ప ఇలా పేదలు నివసిస్తున్న ప్రాంతాలలో రోడ్లు శిథిలమైపోతున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వీకర్సెక్షన్ కాలనీలో మూడు వార్డుల పరిధిలో ఉన్న సిసి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని, లేదంటే ప్రజలను సమీకరించి ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



సిసి రోడ్లను పరిశీలిస్తున్న సిపిఎం ప్రతినిధి బృందం

అస్వస్థతకు గురైన కార్మికులను ఆదుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ దగ్గర పుట్టగొడుగుల పరిశ్రమలో అస్వస్థతకు గురయిన కార్మికులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. పుట్టగొడుగుల పరిశ్రమలో వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. సుదూర ప్రాంతాలయిన బీహార్, ఉత్తరప్రదేశ్, కలకత్తా నగరాల నుండి వచ్చి జీవనం సాగిస్తున్నారన్నారు. కార్మికులకు తగిన రక్షణ చర్యలు పరిశ్రమ యాజమాన్యం చేపట్టకపోవడం వలన కార్మికులు మృత్యువాతకు గురవుతున్నారని అన్నారు. గురువారం మురుగు కాలువలను శుభ్రం చేయడంలో దుర్గంధ వాసనలు వెదజల్లడంతో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. గతంలో కూడా ఇదే పరిశ్రమలో యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల గడ్డివామిలో ఒక కార్మికుని కూతురు శరీరం కాలిందని తెలిపారు. ఇటువంటి సంఘటనలు ఎన్నో ఆ పరిశ్రమంలో జరుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు , ప్రభుత్వం స్పందించి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని అస్వస్థకు గురైన కార్మికులకు మెరుగైన వైద్యం చేయించాలన్నారు. ఒక్కొక్కరికి రూ.ఐదు లక్షలు యాజమాన్యంతో నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- సోలార్ సిస్టం డిజిటల్ బ్యారికేడ్స్ ప్రారంభించిన ఎస్పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలులో ట్రాఫిక్నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కర్నూలు జిల్లా ఎస్పి జి.బిందుమాధవ్ తెలిపారు. గురువారం కర్నూలు కొత్తపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఆవరణంలో కర్నూలు పట్టణ వ్యాపార సంస్థల సహకారంతో ఐదు సోలార్ సిస్టం డిజిటల్ బ్యారికేడ్లను, 10 ఐరన్ బ్యారికేడ్లను , 50 నోపార్కింగ్ బోర్డులను, 2 ఆంప్లిఫైర్లను ఎస్పి జి. బిందుమాధవ్ ప్రారంభించారు. ఎస్పి మాట్లాడుతూ... కర్నూలు పట్టణ వ్యాపారసంస్థల సహకారంతో, పట్టణంలోట్రాఫిక్ను క్రమబద్ధీకరించేందుకు ఐదు సోలార్ సిస్టం డిజిటల్ బ్యారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలనే సూచనలను ఈ సోలార్ బ్యారికేడ్లు డిజిటల్ బోర్డుల ద్వారా తెలియజేస్తాయన్నారు. కర్నూలు ప్రజలను ట్రాఫిక్ నియమ నిబంధనల పట్ల చైతన్య పరచాలనే ఉద్దేశ్యంతోనే పలు రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణ సూచనలు తెలిపే మైక్ ఆనౌన్స్మెంట్ సిస్టమ్స్ను ఏర్పాటు చేశామన్నారు. రద్దీ ప్రాంతాలలో ట్రాఫిక్ను క్రమబద్ధీకరించేందుకు, ఓపెన్ డ్రింకింగ్ జరిగే ప్రాంతాలలో అసాంఘిక కార్యకలపాలను నివారించేందుకు డ్రోన్ కెమెరాలను కూడా వినియోగిస్తున్నామన్నారు. ఐదు సోలార్ సిస్టం డిజిటల్ బ్యారికేడ్లు, 10 ఐరన్ బారికేడ్లు, 50 నో పార్కింగ్ బారికేడ్లు , 2 ఆంప్లిఫైర్లకు సహకారం అందించిన చందన బ్రదర్స్, రామ్రాజ్, విజయ మిల్క్డైరీ, డ్రస్ సర్కిల్, మహాసిమెంట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. రాబోయే రోజులలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఒక ప్రణాళికతో మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఎక్కడైనా అనుమానాస్పద కార్య కలాపాలు, సమస్యలుంటే డయల్ 112 కు గాని, డయల్ 100 కు గాని పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు ఎస్పి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు డిఎస్పి జె.బాబుప్రసాద్, కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ , కర్నూలు పట్టణ సిఐలు ప్రసాద్, అబ్దుల్గౌస్, ట్రాఫిక్ ఆర్ ఎస్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.



బారికేడ్లను ప్రారంభిస్తున్న ఎస్పీ



మాట్లాడుతున్న పిసిసి మాజీ అధ్యక్షులుసాకే శైలజనాథ్

ఎన్నికలను బ్యాలెట్ ద్వారా నిర్వహించాలి

పిసిసి మాజీ అధ్యక్షులుసాకే శైలజనాథ్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఎన్నికలను బ్యాలెట్ పద్ధతి ద్వారా నిర్వహించాలని పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజనాథ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు పి. మురళీకృష్ణ డిసిసి మాజీ అధ్యక్షుడు కె.బాబురావు తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్డిఎ ప్రభుత్వం బాధ్యతా రాహిత్యంగా పనిచేస్తుందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా మాట్లాడితే వారిపైన కక్ష సాధింపు చర్యలతో వేధిస్తుందన్నారు, ఇవిఎంల పైన అనుమానాలు ఉన్నాయన్నారు. మహారాష్ట్రలో బిజెపి అభ్యర్థులు గెలిచిన చోట ఐదు గంటల తర్వాత జరిగిన పోలింగ్ లో 7, 8 శాతం ఓట్లు అదనంగా ఫామ్ 17 సి లో ఎన్ని ఓట్లు రికార్డు అయ్యాయన్నారు. కౌంట్ చేసిన రోజుకు ఐదారు శాతం ఓట్లకు సమాధానం చెప్పేవారు లేరని అన్నారు. ఇవిఎంలను హ్యాక్ చేయవచ్చని మాట్లాడిన వ్యక్తిని బెదిరించి అణచివేసే దోరణిలో పోలీసులు కేసు పెట్టారన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివద్ధి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడును డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కె. వెంకటరెడ్డి, ఐఎన్టియుసి అధ్యక్షులు బి బతుకన్న, ఎస్. ప్రమీల, అనంతరత్నం, సయ్యద్ నవీద్ పాల్గొన్నారు.



జీవన ఎరువులతో నేలసారాన్ని పెంచాలి

- మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ గౌడ్

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

జీవన ఎరువులు వాడి నేత సారవంతాన్ని కాపాడు కోవాలని మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాశ్ గౌడ్ సూచించారు. కోడుమూరు మండలంలో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. ఎఒ రవిప్రకాశ్గౌడ్ మాట్లాడుతూ నేల సారవంతాన్ని కాపాడుకోవడం, జీవన ఎరువులు వాడి వానపాములను పెంపొందించి నేలను కాపాడుకోవడమే ప్రపంచ నేల దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. నేలను సజీవంగా ఉంచి నేల జీవవైవిద్యాన్ని కాపాడాలన్నారు. నేల కోతను అరికట్టాలని, భవిష్యత్ తరాలకు మంచి నేలను అందించాలన్నారు. నేల కాలుష్యం పెరగకుండా చూడాలన్నారు. ఆరోగ్యకరమైన జీవితానికి ఆరోగ్యకరమైన నేలను తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు గ్రామ రైతులతో పాటు ఆర్ఎస్కె సిబ్బంది జయంత్, విజయశాంతి ,ప్రదీప్ కుమార్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

-హాజరైన ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు

-క్రిస్మస్ పండుగకు చేసే దానాలతో జీవితంలో వెలకట్టలేని ఆనందం!!

ప్రజాశక్తి- పత్తికొండ

ఏసుక్రీస్తు పుట్టిన రోజును క్రిస్మస్ పర్వదినంగా క్రైస్తవులు ముందుగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నట్లు ప్రసంగికులు రెవ.బిందెలరాజు అన్నారు. గురువారం పత్తికొండ ఆర్సిఎం మందిరంలో పత్తికొండ డివిజన్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథులుగా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, రెవ.బిందెలరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ..ప్రపంచ వ్యాప్తంగా ఈ వేడుకలను చాలా గ్రాండ్గా జరుపుకుంటారన్నారు. క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషాన్నిస్తుందని, పేద ప్రజలకు దానధర్మాలు చేసి క్రీస్తు ఆశీస్సులు పొందాలని చాలామంది క్రిస్మస్ సందర్భంగా దానధర్మాలకు పెద్దపీట వేస్తారు. తాము సంపాదించిన దానిలో కొంత భాగమైనా పేదలకు పంచాలని, దాని వల్ల కలిగే ఆనందం వెలకట్టలేనిదని ఏసుక్రీస్తు తన బోధనలలో చెప్పారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు క్రైస్తవుల పట్ల చిత్తశుద్ధి కలిగి ఉన్నారని, ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తారని కెఇ.శ్యాంబాబు అన్నారు.ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని పాస్టర్లకు సూచించారు. అనంతరం గ్రాండ్ క్రిస్మస్ పండుగ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరిని ఒకరు కేక్ తినిపించుకున్నారు. వేడుకలకు పాస్టర్లుకు నూతన వస్త్రాలను అందజేశారు. టిడిపి సీనియర్ నాయకులు సాంబశివరెడ్డి, ఎస్సి సెల్ రాష్ట్రఉపాధ్యక్షులు ముత్యాల తిరుపాలు, ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి సుభాష్ చంద్ర, రాజు, ఆనందు, తదితరులు పాల్గొన్నారు.



పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు, బిందెల రాజు

విద్యాభివృద్ధికి సహకరించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి- సి బెళగల్

ఈ నెల 7 న మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ డేను ఘనంగా జరిపి విజయవంతం చేయాలని ఎంఇఒ ఒక ప్రకటనలో జ్యోతి పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ చైర్మన్లు, విద్యాభిమానులు, పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు, ప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విద్య అభివృద్ధి కోసం చర్చలు చేయాలన్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వం చేస్తున్న విద్యాభివద్ధిపై అవగాహన పెంచుకొనేందుకు ఇందులో అధికంగా పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ

సి బెళగల్ మండలంలోని అన్ని పాఠశాలలకు విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను ఎంఇఒ జ్యోతి గురువారం పంపిణీ చేశారు. విద్యార్థుల ప్రతిభ, ఇతర మేధో శక్తి వివరాలు అందులో నమోదు చేస్తారు. అందుకు ప్రతి విద్యార్థికి ఆ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలను ఆమె సూచించారు.

సైబర్ నేరాల నియంత్రణకే పల్లెనిద్ర

కోడుమూరు సిఐ తబ్రేజ్, ఎస్ఐ ఎపి శ్రీనివాసులు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండల పరిధిలోని వెంకటగిరి గ్రామంలో బుధవారం పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలతో సిఐ తబ్రేజ్, ఎస్ఐ ఎపి శ్రీనివాసులు సమావేశమయ్యారు. గ్రామ సమస్యల గురించి ఆరా తీశారు. ఎవరైనా గొడవలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిఐ తబ్రేజ్ మాట్లాడుతూ బ్యాంకు అధికారులమని ఫోన్ చేస్తే మీ ఎటిఎం పిన్ నెంబర్ చెప్పకండని తెలిపారు. ఏ సమస్యలు ఉన్నా 100 డయల్ చేయండన్నారు. పురుగుమందు పిచికారి చేసేటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ డబ్బులు వృథా చేసుకోవద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దని వెల్లడించారు. ప్రతి ఒక్క ట్రాక్టర్ యజమాని ఇన్సూరెన్స్ తీసుకోవాలని, ఇన్సూరెన్స్ కవరేజీ రూ.40 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని ఈ సందర్భంగా వెల్లడించారు.

హంద్రి పరిరక్షణ అవసరం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా మేధావుల కన్సార్టియం ఆధ్వర్యంలో గురువారం పింగళి సూరన తెలుగు తోటలో హంద్రీనది దినోత్సవం సందర్భం 'హంద్రి నది పరిరక్షణ అవశ్యకత తీసుకొనవలసిన చర్యలు' అంశం మీద రౌండ్ టేబుల్ సమావేశాన్ని గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్ర శేఖర క ల్కుర, మానవశక్తి పరిశోధన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య మన్సూర్రెహ్మాన్ నిర్వహించారు. పురాణ కాలం లోనే హైంత్రివతి గా ప్రసిద్ధి గాంచి, అనేక గ్రామాలకు, పట్టణాలకు, నగరాల పుట్టుకకు కారణమైంది హంద్రీనది అన్నారు. మొదటి స్వాతంత్ర పోరా టానికి ముందే బ్రిటిష్ వారితో 1801లో తెర్నేకల్ తిరుగుబాటు, 1839లో కర్నూలు సంస్థానం చేసిన యుద్ధం, 1846లో పాలెగాళ్ల తిరుగుబాటులకు ప్రత్యక్ష సాక్షి హంద్రీనది అని వక్తలు కొనియాడారు.

రౌండ్ టేబుల్ సమావేశం లో చేసిన తీర్మానాలు: మురుగు నీరు, వ్యర్థ పదార్థాల డంపింగును అరికట్టాలి, వరద భద్రతా గోడ ఆవశ్యకత– నిర్మాణం, హంద్రీ నది మధ్యలో లోతైన కాలువ తవ్వడం, లోతట్టు ప్రాంతమైన కర్నూలు నగరానికి దక్కవలసిన నీటి వాటాను సాధించాలి, చెక్ డ్యామ్ ల నిర్మాణం, ఇసుక , మట్టి అక్రమ మైనింగ్ అరికట్టాలి. హంద్రీ నదికి రెండు ఒడ్డు ప్రాంతాలలో మొక్కల పెంచాలి, నది భూమి ఆక్రమణ ఆరికట్టాలని తీర్మానించారు. చర్చలోక్లస్టర్ యూనివర్సిటీ విసి ఆచార్య డివిఆర్ సాయిగోపాల్, వైద్యశాఖ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ డాక్టర్ జయచంద్రరెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య , కర్నూలు జిల్లా చాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షులు లయన్ విజయ్ కుమార్ రెడ్డి, క్లస్టర్ విశ్వ విద్యాలయం డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ అఖ్తర్ బాను, భూగర్భ నీటి శాఖ విశ్రాంత ఉపసంచాలకులు ముచ్చుకోట చంద్రశేఖర్, వ్యవసాయశాఖవిశ్రాంతఉప సంచాల కులు చిన్న నారాయణ, విశ్రాంత డిఎస్పి పాపారావులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మన్సూర్ రహ్మాన్, కల్కూర చంద్రశేఖర్ తదితరులు



కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో క్యాండిల్స్తో నిరసన ప్రదర్శన

టీచర్ను చంపిన వారిని కఠినంగా శిక్షించాలి

కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.ఎజాస్ అహ్మద్ పై దాడి చేసి మృతికి కారకులైన విద్యార్థులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ,సెక్రటరీ జనరల్ ఎస్.గోకారి, జి.తిమ్మప్పలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ముందు గాంధీఉపాధ్యాయులు కొవ్వొత్తుల ప్రదర్శన ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ గతంలో మాకు తెలిసి ఇలాంటి ఘటన ఆంధ్రప్రదేశ్లో ఎక్కడా జరగలేదన్నారు. ఇప్పటికే అస్తవ్యస్తమైన విద్యా వ్యవస్థలో ఈ వార్త ఒక పిడుగులా విస్తరించడంతో రాష్ట్రంలో ఉపాధ్యాయలోకం ఉలిక్కిపడి ఉక్కిరిబిక్కిరి అయిందన్నారు. ఉపాధ్యాయులు శిక్షలు అనుభవిస్తూ ఉంటే ఉపాధ్యాయ లోకం క్షోభిస్తుందన్నారు. అదే పాఠశాల విద్యార్థుల చేతిలో హతుడైన ఉపాధ్యాయుని ఘటనను రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయలోకం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ వెంకటనారాయణమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మరియానంద, నారాయణ, సేవాలాల్ నాయక్, నవీన్ పాటి, సురేష్, మూర్తుజావలి, నిస్సార్, హేమంత్, ప్రసాద్ శివనాగిరెడ్డి, గోవిందు, శ్రీధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సురేష్బాబును, రామ్గోపాల్ను సన్మానిస్తున్న సిబ్బంది

హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇగా సురేష్ బాబు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

హంద్రీనీవా సుజల స్రవంతి ఎస్ఇ గా సురేష్ బాబు కు అదనపు బాధ్యతలు ఇస్తూ శాఖ ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సురేష్ బాబు హంద్రీనీవా సుజల స్రవంతి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం అవుకు జలాశయం ఇఇ గా విధులు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు తీసుకున్న ఎస్ఇ సురేష్ బాబును ఇఇలు చంద్ర శేఖర్ రెడ్డి, సదాశివరెడ్డి, రాజన్ బాబులు పలువురు అధికారులు అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఎస్ఇ గా ఉన్న రామ గోపాల్ ను విశాఖపట్నం కు బదిలీ చేశారు. బాధ్యతలు తీసుకున్న ఎస్ఇ సురేష్ బాబుకు బదిలీ అయిన ఎస్ఇ రామగోపాల్ కు హంద్రీనీవా అధికారులు సిబ్బంది అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానించారు


ప్రాంతీయ కమిటీ సభ్యులతో జిల్లా నాయకులు

సిపిఎం ప్రాంతీయ కమిటీ ఎన్నిక

- కన్వీనర్‌గా హనుమంతు

ప్రజాశక్తి - ఆలూరు

సిపిఎం ఆలూరు ప్రాంతీయ కమిటీలో ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశులు తెలిపారు. గురువారం స్థానిక జ్యోతిబసు భవన్‌లో సిపిఎం ఆలూరు ప్రాంతీయ 3వ మహాసభలు రెండో రోజు సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి అధ్యక్షతన జరిగాయి. ఏడుగురితో కూడిన నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పి.హనుమంతు, సభ్యులుగా కెపి.నారాయణ స్వామి, షాకీర్, వెంకటేశులు, కె.కృష్ణ, రత్నమ్మ, మైనాను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ పి.హనుమంతు మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజా సమస్యలపై ముందుండి పోరాటాలు చేస్తామని తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా ఆలూరు ప్రాంత ప్రజా జీవనాడి వేదవతి, నగరడోన రిజర్వాయర్ నిర్మాణం పూర్తయ్యే వరకు, రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం, ఆలూరు ప్రాంతంలో సిసి రోడ్లు, డ్రైనేజీ, జాతీయ రహదారి నిర్మాణం, ఆలూరు చెరువును సమ్మర్ స్టోరేజ్ నిర్మాణం, తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని మహాసభలో తీర్మానించారు. నాయకులు ఈశ్వర్ గౌడ్, ఈరన్న, షేకున్‌బీ, సి.నాగరాజు, హమాలీ నాగరాజు, గోవర్ధన్, సరోజమ్మ, విఠల్, వీరేష్, గోపాల్ పాల్గొన్నారు.

భయపెడుతున్న గ్రామసింహాలు

• హడలిపోతున్న విద్యార్థులు • అజాగ్రత్తగా ఉంటే ప్రమాదమే..!

ప్రజాశక్తి - చిప్పగిరి

'గ్రామసింహాలు' భయపెడుతున్నాయి. కుక్కల గుంపును చూస్తేనే పెద్దలు, విద్యార్థులు హడలెత్తిపోతున్నారు. చిప్పగిరి బస్టాండ్ ప్రాంతంలో కుక్కలు గుంపులు గుంపులుగా ఉంటున్నాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

చిన్నపిల్లలపై కుక్కలు దాడులు చేయడం, ప్రాణాలు తీసిన సంఘటనలు సైతం నిత్యం పత్రికల్లో, టివిల్లో చూస్తున్నాం. ఏదైనా జరిగితే తప్ప ఏ అధికారులూ పట్టించుకోవడం లేదు. చిప్పగిరిలోని బస్టాండ్ సమీపంలో ఉన్న కుక్కల గుంపును చూసి విద్యార్థులే కాదు.. పెద్దలు కూడా భయపడుతున్నారు. ఏమాత్రం ఏమరపాటున ఉన్నా కుక్కలు మీదికి వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. గత వారంలో ఒక విద్యార్థి కుక్కల గుంపును తరలించడానికి వెళితే ఆ కుక్కలన్నీ మీదికి వచ్చాయి. అదృష్టం బాగుండి అక్కడ బస్సు ఎక్కడానికి ఉన్న వారంతా వాటిని తరిమేశారు. అలాంటి సమయంలో ఎవరూ లేకపోతే ప్రాణాలు మీదికి వచ్చే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. బస్టాండ్ ప్రాంతంలో నిత్యం రద్దీగా ఉన్నా వాటిని చూస్తూనే భయపడే పరిస్థితి ఉంది. మండలంలోని కొన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని విద్యార్థులు వాపోతున్నారు. చిన్నపిల్లలను బయటకు పంపించాలంటే కూడా భయపడే పరిస్థితి ఉంది. బస్టాండ్ దగ్గర పలు హోటళ్లు, చికెన్ షాపులు ఉండడంతో కుక్కల గుంపు అంతా అక్కడే ఉండడంతో రోడ్డు వెంట పోయేవారు.. వచ్చేవారు కూడా చాలా జాగ్రత్తగా వెళ్లే పరిస్థితి ఉంది. ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి వెంటనే కుక్కల బెడద నుంచి కాపాడి వాటిని తరలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


చిప్పగిరి బస్టాండ్ దగ్గర కుక్కల సమూహం

హోళగుందతో పాటు మండలంలోని ఎల్లార్తి, వందవాగిలి, గజ్జహళ్లి, హెబ్బటం, సులువాయి తదితర గ్రామాల్లో ఏ వీధిలోకి వెళ్లినా కుక్కల దండు మొరుగుతూ కనిపిస్తోంది. మంచి కుక్కలు, పిచ్చి కుక్కలు కలిసి తిరగడంతో కుక్కల నుంచి ఎలా తప్పించుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆదమరిచి తిరిగితే అంతే.. కుక్క కాటుకు బలి కాక తప్పదు. రాత్రి 8 గంటలు దాటితే టూ వీలర్‌పై వెళ్తున్న వారిని వెంటబడి కొరికే ప్రయత్నం చేస్తున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కుక్క కాటుకు గురయితే జీవితాంతం బాధపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు కుక్కలు వీధిలో ఒకటో.. రెండో ఉండేవి. అవి కూడా కొత్త వ్యక్తులు ఆ వీధుల్లోకి ప్రవేశిస్తే మొరిగేవి. ఇప్పుడు అలా కాకుండా ప్రతి వీధిలోనూ ఎటు చూసినా కుక్కలే కనిపిస్తున్నాయి. అత్యవసర సమయంలో కాలినడకన బయటికెళితే వెంటపడి దాడి చేస్తున్నాయి. ఇంటి కాపలాగా ఉండే కుక్కలు సైతం ఇంటి యజమానులను కొరికిన సంఘటనలు ఉన్నాయి. చిన్నారుల పరిస్థితి మరి భయంకరం. హోళగుంద మేజర్ పంచాయతీ అధికారులు స్పందించి గ్రామం నుంచి కుక్కలను బహిష్కరించేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


హోళగుందలో కుక్కల గుంపు


పైపులైన్ పనులు చేస్తున్న అధికారులు

సిపిఎం ధర్నాకు స్పందన

- తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- సిపిఎం కృతజ్ఞతలు

ప్రజాశక్తి - మంత్రాలయం

సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు అధికారులు స్పందించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మండలంలోని చిలకలడోణ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఈనెల 2న సిపిఎం ఆధ్వర్యంలో జాతీయ రహదారి 167పై భారీ ఎత్తున గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. గురువారం గ్రామీణ నీటి సరఫరా డిఇ మోహినుద్దీన్ గ్రామాన్ని సందర్శించి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మంత్రాలయం గ్రామం నుంచి చిలకలడోణ గ్రామానికి తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్ పాత పైపు లైన్‌ను తొలగించి కొత్త పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టిన అధికారులకు సిపిఎం మండల కార్యదర్శి హెచ్.ఐయర్కార్, నాయకులు దేవపుత్ర, గ్రామస్తులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, వీలైనంత త్వరగా మరమ్మతులు పూర్తిచేసి గ్రామానికి నీరు సరఫరా చేయాలని కోరారు.

రాజధాని అభివృద్ధికి శ్రీమఠం విరాళం

- చంద్రబాబు చేతికి రూ.50 లక్షల చెక్కును అందించిన పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం


చెక్కును అందిస్తున్న పీఠాధిపతులు

రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రూ.50 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేసినట్లు శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్ వెంకటేష్ జ్యోషి తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. విజయవాడలోని ముఖ్యమంత్రి నివాసానికి చేరుకుని ముఖ్యమంత్రికి, ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు శ్రీమఠం నుంచి జ్ఞాపిక అందజేసి ఆశీర్వదించినట్లు పేర్కొన్నారు. రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని భావించి విరాళం అందించినట్లు చెప్పారు. కావలి ఎమ్మెల్యే డి.వెంకటకృష్ణారెడ్డి, బిజెపి రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జీ పి.నాగభూషణం పాల్గొన్నట్లు తెలిపారు. శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్, ఇఇ సురేష్ కోనాపూర్, ద్వారపాలక అనంతస్వామి ఉన్నారు.

టిడిపితోనే క్రీడాకారులకు ప్రోత్సాహం

- ఎమ్మెల్యే బీవీ

- బీవీ స్మారక అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపి హయాంలోనే క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా.. మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి స్మారక అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఎమ్మెల్యే బీవీ ప్రారంభించారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్, మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీని భారీ గజమాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ... 8 ఏళ్లుగా బీవీ.మోహన్ రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మిగనూరు క్రీడాకారుల కోసం నిర్వహిస్తున్నామని తెలిపారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక క్రీడా పోటీలకు రాజకీయ గ్రహణం పట్టిందని చెప్పారు. టోర్నమెంట్ నిర్వహించడానికి వైసిపి మైదానం ఇవ్వలేదన్నారు. ప్రతి క్రీడాకారుడూ గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకు పోవాలని సూచించారు. ఈ టోర్నమెంట్‌కు దాదాపు 136 జట్లు రావడం సంతోషకరమన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ బ్యాట్ చేత పట్టుకుని క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. టోర్నమెంట్ ఆర్గనైజర్లు సురేష్ చౌదరి, రంగస్వామి గౌడ్, దోమ భీమేష్, ముల్లా జహీర్ అహ్మద్, భార్గవ్ యాదవ్, బసరుకోడు వీరేంద్ర, కృష్ణ తేజ నాయుడు, సోగనూర్ రాఘవేంద్ర, శంకర్ గౌడ్, అమనుల్లా, యు.రఘు, నాగలదిన్నె సుధీర్ పాల్గొన్నారు.


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

- డిఇ మహ్మద్ సైపుల్లా

ప్రజాశక్తి - కౌతాళం

రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామని డిఇ మహ్మద్ సైపుల్లా తెలిపారు. గురువారం ఆయన తుంగభద్ర దిగువ కాలువపై పర్యటించారు. దిగువ కాలువ 250 కిలోమీటర్ల నుంచి 264 కిలోమీటర్ల వరకు నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. 74, 75, కౌతాళం మేజర్, మాధవరం మేజర్ డిస్ట్రిబ్యూటర్లకు సరఫరా అవుతున్న సాగునీటిని పరిశీలించినట్లు ఆయన తెలిపారు.


ఎల్ఎల్‌సి కాలువపై పర్యటిస్తున్న మహ్మద్ సైపుల్లా

ఈనెలాఖరులోపు 600 గృహ ప్రవేశాలు

- కమిషనర్ కృష్ణ


నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీలో ఈనెల చివరిలోపు 600 గృహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. గురువారం పట్టణ శివారులోని ఎన్‌టిఆర్ హౌసింగ్ కాలనీని సందర్శించి, గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కాలనీలో ప్రభుత్వం గతంలో 5,600 గృహాలు మంజూరు చేసిందని తెలిపారు. 2,600 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని చెప్పారు. వారానికి 147 గృహాల చొప్పున పూర్తి చేయించేలా లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈనెల చివరిలోపు 600 మంది లబ్ధిదారులకు గృహాలు అప్పగిస్తామన్నారు. నిర్మాణ పనులకు ఇసుక కొరత రాకుండా డంపు ఏర్పాటు చేశామన్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. గృహ నిర్మాణాలు పూర్తి కాగానే రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేయిస్తామని చెప్పారు.

7న 'మెగా పేరెంట్స్‌డే'

- కెజిబివి ప్రిన్సిపల్ సౌజన్య

ప్రజాశక్తి - చిప్పగిరి


ఎమ్మెల్యే విరుపాక్షిని ఆహ్వానిస్తున్న ప్రిన్సిపల్ సౌజన్య

కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఈనెల 7న జరిగే మెగా పేరెంట్స్‌డేను విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ సౌజన్య కోరారు. గురువారం ఆమె పాఠశాలలో మాట్లాడారు. కస్తూరిబా పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్ మీటింగ్‌ను ప్రభుత్వ ఆదేశాలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బుసినే విరుపాక్షిని ఆహ్వానించినట్లు చెప్పారు. విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. కెజిబివి ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. **నందవరం :** కస్తూరిబా గాంధీ స్కూల్‌లో ఈనెల 7న జరిగే మెగా పేరెంట్స్‌డే మీటింగ్‌ను విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ శైలజ కోరారు. ఆమె మాట్లాడుతూ...కస్తూరిబా స్కూల్‌లో శనివారం మెగా పేరెంట్స్ మీటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. స్కూల్ పూర్వపు విద్యార్థినులు పాల్గొనాలని తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థుల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థినుల తల్లి యాంకరింగ్ చేయవచ్చని తెలిపారు. విద్యార్థినుల తల్లిదండ్రులకు ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


ప్రిన్సిపల్ శైలజ

శ్రీమఠంలో టిడిపి అబ్జర్వర్

- గురు రాజారావు రాకతో ఒక్కటైన టిడిపి శ్రేణులు


ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక వైద్యులు, టిడిపి అబ్జర్వర్ డాక్టర్ గురు రాజారావు గురువారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం సహాయక పిఆర్ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, సీనియర్ నాయకులు పూజారి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. పన్నగ వెంకటేష్ స్వామి స్వగృహంలో గురురాజకు శాలువాతో జ్ఞాపికను అందజేసి టిటిడి ప్రసాదం అందజేశారు. తేనేటి విందు ఆరగించి మాధవరం గ్రామంలోని రాఘవేంద్ర రెడ్డి స్వగృహంలో విందు చేశారు. గురురాజ రాకతో నియోజకవర్గంలో తిక్కారెడ్డి గ్రూపు, రాఘవేంద్ర రెడ్డి గ్రూపు మధ్య గల పోరుకు సంధి కుదిరినట్లయింది. పన్నగ వెంకటేష్ స్వామి ఇంటికి చేరుకున్న రాఘవేంద్ర రెడ్డిని ఇంటికి ఆహ్వానించగా.. ఆయన పన్నగ వెంకటేష్ స్వామిని తన స్వగృహానికి ఆహ్వానించారు. టిడిపి సీనియర్ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, ఉల్లిగయ్య, రామకృష్ణారెడ్డి, సురేష్ నాయుడు, రాకేష్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, బీసీ సెల్ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, చిన్న సుంకప్ప, విజయరామిరెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, పవన్ కుమార్, హండే హనుమంతు, వనికె నాగరాజు, గణేకంటి రఘు, గణేకంటి రామకృష్ణ, గురురాజ, మేకల నరసింహ, మద్రి ఏబు పాల్గొన్నారు.


మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు

ఈరన్న స్వామి సన్నిధిలో...

కౌతాళం : జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామిని టిడిపి అబ్జర్వర్ డాక్టర్ గురు రాజారావు దర్శించుకున్నారు. ఆయన పుణ్యక్షేత్రానికి రావడంతో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్లు శివ మోహన్ రెడ్డి, చెన్న బసప్ప ఘన స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, శాలువా, పూలమాలలతో సన్మానించారు. టిడిపి నాయకులు సతీష్ చౌదరి, శ్రీకాంత్ రెడ్డి, సురేష్ నాయుడు, సుధీర్ రెడ్డి, టిప్పు సుల్తాన్, సతీష్ నాయుడు, కురుగోడు, కావలి ఈరన్న, నరసింహులు, రమేష్ గౌడ్ పాల్గొన్నారు.


కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు

భార్యను, కూతురిని చంపిన కిరాతకుడు

- నిందితుని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హోళగుంద


సలీమా, సమీరా (ఫైల్)

భార్యను, మూడేళ్ల కూతురిని ఓ కిరాతకుడు చంపిన సంఘటన హోళగుంద మండలం హెబ్బటం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మృతురాలి తల్లి, బంధువుల వివరాల మేరకు... ఎమ్మిగనూరు తాలూకా బాపురం, కంబధహాలు గ్రామానికి చెందిన పింజరి సక్రప్పతో హోళగుంద మండలం ఇంగలదహల్ గ్రామానికి చెందిన సలీమా (21)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. రెండేళ్ల క్రితం హోళగుంద మండలం హెబ్బటం గ్రామానికి జీవనోపాధి కోసం వచ్చారు. వీరికి సమీరా(3) కూతురు ఉంది.గ్రామంలో పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు. గురువారం మధ్యాహ్నం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. మృతురాలి సలీమా తల్లి మాబీకి అల్లుడు సక్రప్ప ఫోన్ చేసి 'నీ కూతురు గొడవ గురించి ఏమైనా ఫోన్ చేసి చెప్పిందా' అని ఆరా తీసినట్లు తెలిపారు. అనంతరం పక్కింటి వాళ్లు మాబీకి ఫోన్ చేసి 'నీ కూతురు, మనవరాలు చనిపోయారు' అని సమాచారం ఇచ్చారు. మాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు.

రూ.500 కోసం ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆదోని

అడగగానే రూ.500 ఇవ్వలేదని క్షణికావేశానికి లోనై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదోనిలో చోటు చేసుకుంది. ఆదోని రైల్వే ఎస్ఐ గోపాల్ వివరాల మేరకు... పట్టణంలోని కిల్చిన్ పేటకు చెందిన రాఘవేంద్ర కుమారుడు సాగరే ఆకాష్ (20)గా గుర్తించామన్నారు. తల్లిదండ్రుల వివరాల మేరకు... మోటార్ సైకిల్ ఖర్చు నిమిత్తం ఆకాష్ రూ.500 అడిగాడు. ఇవ్వకపోవడంతో క్షణకావేశానికి లోనై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదోని, ఇస్వి మధ్యలో డౌన్ రైల్వే లైన్ ట్రాక్ మధ్యలో మృతదేహం పడి ఉన్న విషయాన్ని రైల్వే పైలట్ ఇచ్చిన సమాచారం మేరకు ఇక్కడికి వచ్చి పరిశీలించామని రైల్వే ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దేవనకొండ మొదటి స్థానంలో ఉండాలి

- ఎమ్మెల్యే శ్యాంబాబు

ప్రజాశక్తి- దేవనకొండ

టిడిపి సభ్యత్వ నమోదులో దేవనకొండ మండలం మొదటి స్థానంలో ఉంచేలా నాయకులు కృషి చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు తెలిపారు. గురువారం దేవనకొండలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళా నాయకులు జ్యోతితో పాటు ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవనకొండ మండలం టిడిపికి కంచుకోట లాంటిదని తెలిపారు. 2026 నియోజకవర్గాల పునర్విభజనలో దేవనకొండ మండలం పత్తికొండ నియోజకవర్గంలోకి వచ్చినా ఆశ్చర్యం లేదని చెప్పారు. 25 ఏళ్లుగా ఆలూరు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరలేదని, రాబోయే ఎన్నికల్లో కొత్త వారి నాయకత్వంలో టిడిపి జెండాను ఎగరవేద్దామని తెలిపారు. కప్పట్రాళ్ల సర్పంచి చెన్నమనాయుడు, టిడిపి మండల నాయకులు ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, మల్లయ్య, మల్లికార్జున గౌడ్, రాజశేఖర్ గౌడ్, పురుషోత్తం గౌడ్, కాకర్ల శాంతి కుమార్, మలకన్న, బండ్లయ్య పాల్గొన్నారు.


ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ గ్రూపు గైర్హాజరు

సభ్యత్వ నమోదుకు టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ గ్రూపు గైర్హాజరయింది. మండలంలో టిడిపిలో గ్రూపు విభేదాలు బహిర్గతమయ్యాయి.

హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదును టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం జ్యోతి అధ్యక్షతన కురువ ప్రకాష్, అసుండి శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టారు. వారు మాట్లాడుతూ... సభ్యత్వ నమోదుకు కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి పేర్లు నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. మారుతి పాల్గొన్నారు. **హోళగుంద**లో చేపట్టిన సభ్యత్వ నమోదుకు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివ ప్రసాద్, టిడిపి మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శేషగిరి, గోవింద గౌడ్, విష్ణువర్ధన్, దర్గన్న, చోళరెడ్డి, సీతయ్య పాల్గొన్నారు.


దేవనకొండలో సభ్యత్వ నమోదు చేస్తున్న ఎమ్మెల్యే శ్యాం బాబు


హాలహర్విలో మాట్లాడుతున్న నాయకులు


హోళగుందలో...

ఉపాధ్యాయుని కుటుంబానికి న్యాయం చేయాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - గోనెగండ్ల

అన్నమయ్య జిల్లా రాయచోటి కొత్తపల్లి ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల దాడిలో మృతి చెందిన ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గోనెగండ్లలోని విద్యా వనరుల కేంద్రం వద్ద నిరసన చేపట్టి, ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ... ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులను కలచి వేసిందని తెలిపారు. ఈ విష సంస్కృతిని నియంత్రించేందుకు ప్రభుత్వం వెంటనే నిందితులను శిక్షించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు, సీనియర్ ఉపాధ్యాయులు ఉస్మాన్, భాస్కర్, తాజుద్దీన్, మహబూబ్ బాషా, కెసి.నాగరాజు, రాముడు, సుంకన్న, ఖాదర్ బాషా, రంగస్వామి పాల్గొన్నారు.


వినతి పత్రం సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు


నిరసన చేపడుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుని హత్య దారుణం

- ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - ఆదోని

అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత ఉర్దూ పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు, పాఠశాల సహాయకులుగా పనిచేసే ఏజాస్ అహ్మద్‌ను అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు దాడి చేసి హత్య చేయడం దారుణమని ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్ తెలిపారు. గురువారం ఆదోని సబ్ కలెక్టరేట్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కె.రవి, లోక్య నాయక్, సుధాకర్, భీమరాజు, రాజా సతీష్, ఖలీల్, గురు రాజా, గురు స్వామి, మధుసూదన్ రావు ఉన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి

- తహశీల్దార్ శివరాముడు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తహశీల్దార్ శివరాముడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. మండలంలో శుక్రవారం నుంచి జనవరి 8 వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రెవెన్యూ గ్రామ సదస్సులు జరుగుతాయని తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు తప్పనిసరిగా ఈ సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. గ్రామ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

చిప్పగిరి : కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి జరిగే రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. రెవెన్యూ గ్రామ సభలు రామదుర్గం గ్రామం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. రైతులందరూ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. గ్రామంలో ముందుగా ఆయా గ్రామాల రెవెన్యూ కార్యదర్శులకు, సచివాలయ సర్వేయర్లకు సమాచారం ఇచ్చి, అనంతరం వారు ప్రజలకు, రైతులకు తెలుపుతారన్నారు. ఆర్ఐ సునీత, జూనియర్ అసిస్టెంట్ వీరేష్ పాల్గొన్నారు.

ఆలూరు : మండలంలోని భూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ గోవింద్ సింగ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ... గత అక్టోబర్‌లో 18 నుంచి 30 వరకు మండలంలోని రీసర్వే జరిగిన 10 గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో భూ సమస్యలు 708 రాగా అందులో 118 రెవెన్యూ సమస్యలు, మిగిలినవి సర్వే సమస్యలు ఉన్నాయని తెలిపారు. వచ్చిన ఫిర్యాదుల్లో 138 పరిష్కరించినట్లు చెప్పారు.

టిడిపితోనే అభివృద్ధి

- టిడిపి సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


సభ్యత్వం అందిస్తున్న భాస్కర్ రెడ్డి

రాష్ట్రంలో టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఢణాపురం, నారాయణపురం, చాగి, నాగనాథనహళ్లి గ్రామంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. టిడిపి నాయకులు సౌదీ రావుఫ్, ఫక్రుద్దీన్, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, సోమశేఖర్ రెడ్డి, మల్లేశ్వరప్ప, మద్దికెర రామకృష్ణ, ఎమ్‌డి.హుస్సేన్, నారాయణపురం షాషావలీ, ఇస్వి శ్రీనివాసులు, బిటి.శీన, హోసల్లి రఘునాథ్ రెడ్డి, మదిరె మాజీ సర్పంచి గోవిందు, రమేష్, షేకన్న, తిమ్మప్ప, మదిరె శ్రీనివాస్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయాలి

- ట్రైయినీ డీఎస్పీ ఉషశ్రీ

ప్రజాశక్తి - ఆస్పరి



ట్రైయినీ డీఎస్పీ ఉషశ్రీని సన్మానిస్తున్న నాయకులు

సమాజంలో బాలికలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని ట్రైయినీ డీఎస్పీ ఉషశ్రీ తెలిపారు. గురువారం ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఓ చెల్లెమ్మ.. జర జాగ్రత్త' అంశంపై సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ట్రైయినీ డీఎస్పీ ఉషశ్రీ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జీవిత, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నరసింహులు, విజేత పాఠశాల కరస్పాండెంట్ మల్లేష్, ధనలక్ష్మి హాజరై మాట్లాడారు. సమాజంలో బాలికలు ఎలా రక్షణ పొందాలో వివరించారు. మహిళలకు రాజ్యాంగంలో ఉన్న హక్కులు, చట్టాలను వివరించారు. అనంతరం ఉషశ్రీని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు తరుణ్, మహేష్, నాయకులు మహేష్ పాల్గొన్నారు.

'పట్టణ అభివృద్ధికి సహకరించాలి'

ప్రజాశక్తి - ఆదోని



సకాలంలో పనులు చెల్లించి పట్టణ పురోగతికి సహకరించాలని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. పట్టణంలో కొందరు సకాలంలో పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సుమారు 250 మందిని మొండి బకాయిదారులుగా గుర్తించి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఈఏడాది రూ.16 కోట్లు ఇంటి, ఖాళీ స్థలానికి సంబంధించిన టాక్స్ వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు రూ.6.30 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. సచివాలయం వారీగా ఉద్యోగులను భాగస్వామ్యం చేసి పన్ను వసూళ్ల లక్ష్యం పూర్తి చేస్తామని చెప్పారు.

వడ్డీ రాయితీ పొందండి : 2024-25 ఆర్థిక అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. ఈనెల 31 వరకు పెండింగ్‌లో ఉన్న పన్నులు మొత్తం చెల్లిస్తే వడ్డీ రాయితీ సౌలభ్యం అందుబాటులో ఉందని తెలిపారు.